క్లుప్తంగా

బాల్య వివాహాలతో అనర్థాలు


బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: బాల్య వివాహాలతో పలు అనర్థాల చేసకుంటాయని హెల్త్ ఎడ్యుకేటర్ లక్ష్మి కల్యాణి అన్నారు. సోమవారం కసాపురం హెల్త్ సబ్‌సెంటర్‌లో బాల్య వివాహాల కట్టడిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న వయసులో గర్భం దాల్చడం వల్ల ఆడపిల్లలు ఎదుర్కొనే సమస్యలపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. 21 సంవత్సరాలు నిండే దాకా ఆడపిల్లలకు పెళ్లి చేయరాదని, అలా చేస్తే చట్టరీత్యా నేరమన్నారు. అలాగే గర్భిణులు ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవం చేయించుకోవాలన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా మనోహర్‌బాబు

యల్లనూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా మనోహర్‌బాబు సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న రెగ్యులర్ ఎంపీడీఓ శ్రీకాళహస్తిలో జూలై 28 నుంచి ఆగస్టు 26వ తేదీ వరకూ నిర్వహించే శిక్షణకు హాజరయ్యారు. యల్లనూరులో డిప్యూటీ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు అదనపు బాధ్యతలను ఉన్నతాధికారులు అప్పగించారు. ఆయనకు సచివాలయాల ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

బైక్ బోల్తా- వ్యక్తికి గాయాలు


గాయపడిన నాగరాజు

గుత్తి: మండలంధిలోని కొత్తపేట గ్రామంలో ఉన్న నరసింహస్వామి దేవాలయం వద్ద సోమవారం బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో బైక్‌ను డ్రైవ్ చేస్తున్న నాగరాజు కుడి కాలు విరిగింది. మామిళ్ల చెరువు గ్రామానికి చెందిన నాగరాజు బైక్‌లో గుత్తికి వస్తుండగా మార్గ మధ్యలో ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను తప్పించబోయి అదుపు తప్పి బోల్తా పడింది. గాయపడిన నాగరాజును గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం రెఫర్ చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఐస్ బండిని ఢీ కొన్న టిప్పర్

- ఒకరికి గాయాలు


గాయపడిన సాలప్ప

గుత్తి/పెద్దవడుగూరు: పెద్దవడుగూరు మండలంలోని గుత్తిఅనంతపురం సమీపంలోని 44 నెంబర్ జాతీయ రహదారిపై సోమవారం ఐస్ బండిని టిప్పర్ ఢీ కొంది. ప్రమాదంలో ఐస్ బండి తోలుతున్న సాలప్ప తీవ్రంగా గాయపడ్డాడు. పామిడి మండలం మాముదూరుకు చెందిన సాలప్ప ఐస్ బండిని గుత్తికి తెస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. గాయపడిన అతడని గుత్తి ఆస్పత్రికి తరలించారు. అనంతరం అనంతపురం రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వినాయక విగ్రహం ఏర్పాటు


వినాయకుడికి పూజలు చేస్తున్న తహసీల్దార్

యల్లనూరు: తహసీల్దారు కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ రాము ఆధ్వర్యంలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. నాగుల చవితి పండుగ రోజున తహసీల్దారు కార్యాలయంలో వరసిద్ధి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో రైతులు, ప్రజలు స్వామి సేవలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోసం ఉద్యమం


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

బుక్కరాయసముద్రం: ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ ఉద్యమాలు చేపట్టేందుకు సిద్ధమవుతోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జాఫర్ అన్నారు. సోమవారం బీకేఎస్ మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో జన సేవా శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కారం కోసం సీపీఐ ఆధ్వర్యంలో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి ఆందోళనలకు సిద్ధమవుతున్నామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నారాయణస్వామి, ఏపీ మహిళా కార్యదర్శి పద్మావతి, రైతు సంఘం జిల్లా నాయకులు రామాంజనేయులు, ఆనంద్, సుంకన్న, తిరుపతయ్య, బాషా పాల్గొన్నారు.

రహదారులపై మూగజీవాల తిష్ట


గుత్తిలో రోడ్డుకు అడ్డంగా పశువులు ఉండడంతో ఇబ్బందిగా వెళ్తున్న ట్రాక్టర్


రోడ్డుపై సంచరిస్తున్న పశువులు

- తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు

గుత్తి: రహదారులపై మూగజీవాలు తిష్ట వేస్తుండడంతో వానదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గుత్తి,గుత్తి ఆర్‌ఎస్‌లలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై మూగ జీవాలు (ఆవులు, ఎనుములు, ఎద్దులు, దూడలు) సేద తీరుతున్నాయి. రద్దీగా ఉన్న ప్రాంతాల్లో మూగ జీవాలు రోడ్లపై ఉండటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. తరుచూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గుత్తిలోని గాంధీ సర్కిల్, కర్నూల్ రోడ్డు, ఎన్టీఆర్ సర్కిల్, ప్రభుత్వాస్పత్రి, ఆర్‌ఎస్‌లోని పత్తి కొండ రోడ్డు, మెయిన్ బజారులలో పశువులు రోడ్లపైనే తిష్ట వేస్తున్నాయి. పశువులు రోడ్లపై ఉండటంతో ఎలా వెళ్లాలని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ అధికారులు, పోలీసులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా మున్సిపల్, పోలీసు అధికారులు స్పందించి యజమానులను పిలిపించి పశువులు రోడ్లపైకి రాకుండా చూడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం



పశువులు రోడ్లపైకి రాకుండా చూస్తాం. త్వరలో యజమానులను పిలిపించి పశువులు రోడ్లపైకి రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో రెండు సార్లు పశువుల యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి హెచ్చరించాం. మరోసారి యజమానులతో సమావేశం నిర్వహించి పశువులు రోడ్లపైకి రాకుండా చర్యలు తీసుకుంటాం.

–జబ్బార్ మియా, మున్సిపల్ కమిషనర్

ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోండి


ఇసుక తరలించడంతో ఏర్పడిన గుంతలు


మామిడి మొక్కలను ధ్వంసం చేసిన అక్రమార్కులు

టాస్క్‌ఫోర్స్: పెద్దవడుగూరు మండలంలోని చిత్రచేడు, మొళకతాళ్ల గ్రామాల సమీపంలోని పెన్నానదిలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు కవిత, సంజీవ సోమవారం అనంతపురంలో కలెక్టర్‌ను ఆశ్రయించారు. వారు మాట్లాడుతూ గోపురాజుపల్లి పొలంలో సర్వే నెంబర్ 344లో మూడు ఎకరాల్లో గత 16 ఏళ్లుగా మామిడి చెట్లు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఈ భూమి సమీపంలో కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్నారు. కవిత మాట్లాడుతూ తాను భర్తను కోల్పోయి మామిడి చెట్ల ఫలసాయం ద్వారా కుటుంబాన్ని పోషించుకుంటున్నానన్నారు.. మా గ్రామానికి చెందిన రాచేపల్లి ఆంజనేయులు అనే వ్యక్తి జేసీబీ సహాయంలో పెన్నానది లోకి రస్తా వేసుకొని టిప్పర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నాడన్నారు. అక్రమాలను అడ్డుకోబోయిన తమ ను టిప్పర్ తో గుద్దిచంపుతామని బెదింపులకు పాల్పడుతున్నారన్నారు. ఇసుకను తరలిస్తే భూగర్భజలాలు ఇంకి పోయి నీళ్లు చాలక మామిడి చెట్లు చనిపోయే ప్రమాదం ఉందని, తమను కాపాడాలని కోరారు.

ఇసుక తరలించకుండా రైతుల కాపలా..

శింగనమల: మండలంలోని నిదనవాడ గ్రామ సమీపంలోని పెన్నానదిలో పెద్దవడుగూరు మండలం ఉప్పలపాడు, చిత్రచేడు తదితర గ్రామాల టీడీపీ నాయకులు అక్రమంగా ఇసుక తరలిస్తుండడంతో నిదనవాడ గ్రామంలోని రైతులు పార్టీలకతీతంగా పెన్నానదిలోకి వెళ్లి కాపలా కాస్తున్నారు. పెన్నానదిలో నిదనవాడ పొలిమేర వరకూ సోమవారం రాత్రి రైతులు వెళ్లి పరిశీలించారు. పెన్నానదిలో ఇంత భారీ స్థాయిలో అక్రమంగా ఇసుక తరలిపోతున్నా పెద్దవడుగూరు మండల రెవెన్యూ అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

సింగిల్‌విండో పాలకవర్గ ప్రమాణ స్వీకారం

గుత్తి: మండలంలోని తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి ఆలయంలో సోమవారం తొండపాడు సింగిల్ విండో నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు, గుత్తి ఇన్‌చార్జ్ ఈశ్వర్ హాజరయ్యారు. సింగిల్ విండో జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ రవి నూతన పాలక వర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు. సింగిల్ విండో ప్రెసిడెంట్‌గా నంద్యాల శివశంకర్‌యాదవ్, డైరెక్టర్లుగా రమణ, సుంకన్న లు ప్రమాణం చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ, మండల కన్వీనర్లు చౌదరి, బర్దివలి, నాయకులు చిన్నరెడ్డి యాదవ్, న్యాయవాది సోము, రంగా తదితరులు పాల్గొన్నారు.

పేదల పెన్నిధి తరిమెల నాగిరెడ్డి


శింగనమలలో మాట్లాడుతున్న నాయకులు

శింగనమల/గుంతకల్లుటౌన్: నిరుపేదల అభ్యున్నతి కోసం ఎన్నో పోరాటాలు చేసి తరిమెల నాగిరెడ్డి పేదల పెన్నిధిగా నిలిచారని పలువురు నాయకులు కొనియాడారు. తరిమెల నాగిరెడ్డి వర్ధంతి కార్యక్రమం పార్టీ జిల్లా కార్యదర్శి నాగరాజు అధ్యక్షతన సోమవారం శింగనమలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శింగనమలలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యదర్శి ఇండ్ల ప్రభాకర్ రెడ్డి, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ సభ్యుడు రామాంజినేయులు, జిల్లా కార్యదర్శి నాగరాజు, సహాయ కార్యదర్శి కృష్ణ, కోశాధికారి రాయుడు, రాజశేఖర్, ఖాదర్ బాషా, పెద్దన్న, రంగయ్య, శంకర్, శ్రీరాములు, పేదల సంఘం జిల్లా అధ్యక్షుడు వీరనారప్ప, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే గుంతకల్లులోని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ కార్యక్రమంలో తరిమల నాగిరెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఓపీడీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు లాయర్ నాగరాజు, సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్, రాయలసీమ విద్యావంతుల వేదిక కార్యదర్శి వెంకటేష్, నాయకులు రఘునాథరెడ్డి, వెంకప్ప, దావీద్, నాగరత్నమ్మ, జిలాన్, సత్తార్, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

ఉరుసులో భక్తుల సందడి


ఉరుసు ప్రాంగణంలో జాయింట్ వీల్, రింగ్ డాన్స్


చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఊయలలు

గుంతకల్లు: పట్టణంలోని పాతగుంతకల్లులో వెలసిన హజరత్ సయ్యద్ మస్తాన్ ఉరుసు ఉత్సవాలు పూర్తయినా నెలకు పైగా భక్తుల రద్దీ కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో మస్తానయ్యను భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని చక్కెర, లడ్డూ, టెంకాయిలు వంటి వాటిని సమర్పించి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఉరుసు సందర్భంగా గాజుల అంగళ్లు, తినుబండారాల (ఖాజా) దుకాణాలు, ఆట వస్తువులు అంగళ్లు వెలిశాయి. అదేవిధంగా చిన్నారులు ఆడుకోవటానికి వివిధ రకాల జాయింట్ వీల్స్, రింగ్ రింగ్ డాన్స్‌తో పాటు పెద్ద ఊయలలు తదితర ఆట పరికరాలు ఆకట్టుకుంటున్నాయి. భక్తులు సాయంత్రం 4.00 గంటల నుంచి రాత్రి 12.00 గంటల వరకు షాపింగ్ చేస్తూ కుటుంబసభ్యులతో గడుపుతున్నారు.

వైభవంగా నాగులచవితి వేడుకలు


తాడిపత్రి సమీపంలోని పుట్ట వద్ద పూజలు నిర్వహిస్తున్న మహిళలు


పెద్దపప్పూరు మండలం కమ్మవారిపల్లిలో ప్రతిష్ఠించిన నాగదేవతా మూర్తులు

తాడిపత్రి రూరల్/యాడికి/పెద్దపప్పూరు/గుత్తి/గార్లదిన్నె: తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో సోమవారం నాగులచవితి పండుగ వైభవంగా నిర్వహించారు. మహిళలు పలు దేవాలయాల్లోని నాగుల విగ్రహాలు, పుట్టలకు ప్రత్యేక పూజలు చేశారు. నాగుల విగ్రహాలకు, పుట్టల్లోకి పాలు పోసి నైవేద్యాలు, దుస్తులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కొందరు మహిళలు నోములు నోచుకున్నారు. పండుగను పురస్కరించుకుని దేవాలయాలు, పుట్టల వద్ద మహిళలు కిక్కిరిసిపోయారు. అలాగే యాడికి, పెద్దపప్పూరు, గుత్తి, గార్లదిన్నె మండలాల్లోని గ్రామాలతోపాటు గుత్తి ఆర్‌ఎస్‌లో నాగుల చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పెద్దపప్పూరు మండలంలోని కమ్మవారిపల్లిలో సోమవారం నాగ పంచమి సందర్భంగా నాగదేవత విగ్రహాలను ప్రతిష్ఠించారు. అదేవిధంగా గార్లదిన్నె మండలంలోని కోటంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద పుట్టకు, సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మహిళలు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు.

అర్హత ఉన్నా అందని తల్లికి వందనం





తల్లికి వందనం పథకం వర్తించని అభిరామ్, హర్ష

పామిడి: అర్హత ఉన్నా అధికారుల నిర్లక్ష్యంతో ఓ కుటుంబానికి తల్లికి వందనం పథకం వర్తించలేదు. కూటమి ప్రభుత్వం ఒకే ఇంట్లో ఎంతమంది చదువుకుంటున్నా అందరికీ తల్లికి వందనం ఇచ్చామని గొప్పలు చెప్పుకుంటున్నా.. క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా జరుగుతోంది. వివరాలు.. మండలంలోని దేవరపల్లికి చెందిన వ్యవసాయాధారిత కటుంబంమైన ఎన్.ఓబులేసు, కీర్తి దంపతులకు ఇద్దరు కుమారులుండగా అభిరామ్ తొమ్మిదో తరగతి, హర్ష ఆరో తరగతి చదువుతున్నారు. 2014లో అనారోగ్యంతో కీర్తి చనిపోయింది. దీంతో వారికి తండ్రి ఓబులేసు సంరక్షకుడయ్యాడు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన మొదటి ఏడాది పూర్తిగా తల్లికి వందనం పథకం ఎగురగొట్టింది. దీంతో రెండో ఏడాదైన కూటమి ప్రభుత్వం చెప్పినట్లు అర్హత గల ఇరువురికీ పథకం వర్తించాల్సి ఉంది. కానీ ఈ పథకం వర్తించిన పాపాన పోలేదు. దీంతో పథకం వర్తింపునకు పలుమార్లు గ్రీవెన్స్‌లో అర్జీలిచ్చినా ఫలితం శూన్యమవ్వడంపై బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తోంది. దీనికితోడు ఎస్సీ కేటగిరిలో ఇంటర్ విద్యార్థులకు ఈ పథకం కింద సగం డబ్బే రూ. 7వేలు వర్తింపజేయడంపై ప్రభుత్వ కుల వివక్షతపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అందులోనూ ఇప్పటికీ జూనియర్ ఇంటర్‌కు సంబంధించి ఎస్సీ కేటగిరీ విద్యార్థులకు తల్లికి వందనం పథకం డబ్బులు జమ కాకపోవడంపై ఆ కేటగిరి వర్గాల్లో అసంతృప్తి సెగలు మిన్నంటుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు తక్షణం స్పందించి తల్లికివందన పథకంలోని బాలారిష్టాలు, కుల వివక్షతను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

వడ్డీ మాఫియాపై చర్యలు తీసుకోండి


మాట్లాడుతున్న ఆంజనేయులు

అనంతపురం టవర్‌క్లాక్: కూటమి ప్రభుత్వంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ కేవలం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, వడ్డీ మాఫియాపై చర్యలు తీసుకోవడం లేదని వైఎస్సార్ సీపీ శింగనమల నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు వడియం పేట ఆంజనేయులు మండిపడ్డారు. సోమవారం స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వడ్డీ వ్యాపారులు మాఫియాగా ఏర్పడి వారం వడ్డీలకు డబ్బులు ఇచ్చి, వడ్డీ కట్టడంలో ఆలస్యం చేస్తే ఇళ్ల లోకి, దుకాణాల్లోకి వెళ్లి దాడులు చేస్తున్నారన్నారు. ధర్మవరంలో మంత్రి సత్యకుమార్ ఇలాఖాలలో వడ్డీ మాఫియా చెలరేగి పోతున్నా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. మొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నియోజకవర్గంలో ఓ మహిళను చెట్టుకు కట్టేసి దాడి చేశారన్నారు. ఆ ఘటన మరువకనే అనంతపురం నగరంలో వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కూతవేటు దూరంలో బంగారు షాపులో పనిచేసే వ్యక్తిపై వడ్డీ మాఫియా దాడి చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ రెండు సంఘటనలు మరువకనే శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో బాధితుని ఇంట్లోకి చొరబడి కుటుంబ సభ్యులపై దాడి చేయడం హేయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరచి వడ్డీ మాఫియాపై కఠిన చర్యలు తీసుకుని బాధితులకు రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ నగర మాజీ అధ్యక్షుడు సాకే శివశంకర్, నాయకులు వెంకటాపురం మల్లె పోగుల నాగేష్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టల్ విద్యార్థులపై కూటమి కక్ష


నార్పలలో బాలికల వసతి గృహంలో విద్యార్థుల సమస్యలను తెలుసుకుంటున్న చంద్రశేఖర్‌యాదవ్

నార్పల: సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులపై కూటమి ప్రభుత్వం కక్ష సాధిస్తోందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ మండిపడ్డారు. ఆయన సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. అక్కడ మౌలిక వసతులను పరిశీలించి, విద్యార్థినులతో వసతి గృహంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్య ఉందని, ట్రంకు పెట్టెలు, దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు, పుస్తకాలు సరిగ్గా ఇవ్వలేదని విద్యార్థినులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అలాగే మరుగుదొడ్ల సౌకర్యం సరిగ్గా లేదని, కోతుల బెడద అధికంగా ఉందన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి వసతి గృహాల్లో మౌలిక వసతులు సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు దేవేంద్ర, నియోజకవర్గ అధ్యక్షుడు చిన్నికృష్ణ, విద్యార్థి విభాగం జిల్లా కార్యదర్శి గుగ్గిళ్ల హరినాథ్‌రెడ్డి, మహేష్‌నాయక్, రేవంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో వసతులు కల్పించండి

గుంతకల్లుటౌన్: రాష్ట్రంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇతర ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంశీయాదవ్, నియోజకవర్గం అధ్యక్షుడు నక్కానారప్ప డిమాండ్ చేశారు. వైఎస్సార్‌ఎస్‌యూ రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు హాస్టల్‌బాట కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక ఎస్సీ గర్ల్స్ హాస్టల్స్‌ను విద్యార్థి నాయకులు పరిశీలించారు. వారు మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. హాస్టల్స్‌కు సొంతభవనాలు నిర్మించాలని, విద్యార్థులకు సకాలంలో కాస్మొటిక్ ఛార్జీలు చెల్లించాలని, నాణ్యమైన భోజనాన్ని వడ్డించాలని, హాస్టల్స్‌లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. వైఎస్సార్‌ఎస్‌యూ మండల అధ్యక్షుడు అనిల్‌కుమార్, ఉపాధ్యక్షుడు గణేష్, నాయకులు పవన్, మధు, తదితరులు పాల్గొన్నారు.

‘కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి’

గుంతకల్లు రూరల్: రైల్వే ట్రాక్ పక్కన భూమిని వాడుకుని వ్యవసాయానికి పనికిరాకుండా చేసిన కాంట్రాక్టర్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు బాధిత రైతు మురళితో కలసి సోమవారం సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బీ.శ్రీనివాసులు మాట్లాడుతూ గుంతకల్లు పట్టణంలోని అల్లీపీరా కాలనీకి చెందిన రైతు మురళి రెండేళ్ల క్రితం పడమటి గుంతకల్లు దగ్గర సర్వే నెంబర్ 94–బీ1లో 1.26 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశాడన్నారు. గతేడాది కందిపంటను సాగు చేశాడని, ఈ ఏడాది విత్తన సాగుకోసం పొలానికి వెళ్లగా.. కాంట్రాక్టర్, రైల్వే అధికారులు ఆ భూమిలో సగానికి పైగా నిర్మాణానికి సంబంధించిన వ్యర్థాలు, మట్టి వేసి సాగుకు పనికిరాకుండా చేశారన్నారు. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని, అక్రమణకు గురైన భూమిని ఇప్పించడంతోపాటు, రైతుకు నష్ట పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు సాకే నాగరాజు, రాము నాయక్, జాషువా, తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

పెద్దపప్పూరు: మండలంలోని చీమలవాగుపల్లి సమీపంలో పేకాట స్థావరంపై దాడి చేసి10 మంది జూదరులను అరెస్టుచేయడంతో పాటు వారి నుంచి రూ.10,160 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ సోమ వారం తెలిపారు. మండలవ్యాప్తంగా ఎక్కడైనా మట్కా, పేకాట, ఇసుక అక్రమ రవాణా తదితర అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను ఆయన కోరారు.

ఎన్‌సీసీతో ఉజ్వల భవిష్యత్తు

గుంతకల్లు రూరల్: ఎన్‌సీసీ శిక్షణతో విద్యార్థులు ఉజ్వల భవిష్యత్ సాధ్యమని శ్రీశంకరానందగిరీ కళాశాల కరస్పాండెంట్ కేసీ హరి అన్నారు. సోమవారం కళాశాలలో ఎన్‌సీసీ శిక్షణలో ప్రతిభ కనబరచిన క్యాడెట్స్‌ను అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్ర మహిళా బెటాలియన్, అనంతపురం ప్రతినిధులు సంయుక్తంగా 10 రోజుల పాటు నిర్వహించిన శిక్షణ శిబిరంలో కళాశాల నుంచి ఎనిమిది మంది మహిళా క్యాడెట్స్ పాల్గొని ప్రతిభ కనబరచారన్నారు. బీఎస్సీ ఫైనల్ ఇయర్ విద్యార్థిని షాలిని క్యాంపు కంట్రోలర్‌గా ప్రథమ స్థానంలో నిలిచి పతకం సాధించిందన్నారు. అదేవిధంగా క్విజ్, కల్చరల్ పోటీల్లో ఉత్తమ క్యాడెట్‌గా కౌసల్య ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన క్యాడెట్స్‌ను అభినందిస్తూ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

ప్రతి ఇంటికీ చంద్రబాబు మోసాలు


బీకేఎస్ మండలం బోయ కొట్టాలలో చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న గువ్వల శ్రీకాంత్‌రెడ్డి


తాడిపత్రిలో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు


గార్లదిన్నె మండలం బూదేడులో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు


యాడికి మండలం పుప్పాలలో రీకాలింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు


నార్పల మండలం నడిమిదొడ్డిలో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న మండల కన్వీనర్ ఖాదర్‌వలిఖాన్

బుక్కరాయసముద్రం/తాడిపత్రి టౌన్/ గార్లదిన్నె/యాడికి/నార్పల: కూటమి ఏడాది పాలనలో హామీలు అమలు చేయకుండా ప్రతి ఇంటికీ చంద్రబాబు మోసం చేశారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త శైలజానాథ్ పిలుపు మేరకు సోమవారం సాయంత్రం బుక్కరాయసముద్రం మండలం గోవిందపల్లి పంచాయతీలోని బోయకొట్టాల, భద్రంపల్లి, గోవిందపల్లి, జంతలూరు గ్రామాల్లో ఇంటింటికీ చంద్రబాబు మోసం–మోసపూరిత హామీల రీలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గువ్వల శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి చంద్రబాబు మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చంద్రబాబు ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాడన్నారు. అనంతరం చంద్రబాబు మోసం చేసిన విధానాన్ని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సర్పంచ్ పార్వతి, నాయకులు లక్ష్మిరెడ్డి, అంకే నరేష్, మునలన్న, రాజు, కాశీ విశ్వనాథ్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, ఎర్రి నాగప్ప, సంజీవరెడ్డి, పూల నారాయణస్వామి, చికెన్ నారాయణస్వామి, సాకే లక్ష్మి నారాయణ, బయపరెడ్డి, రంగా, బాలక్రిష్టారెడ్డి, నగేష్, ఆది, భాస్కర్, సత్తి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

- తాడిపత్రి పట్టణంలోని 36వ వార్డులో సోమవారం రీ కాలింగ్ చంద్ర బాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళ ప్రధాన కార్యదర్శి పేరం స్వర్ణలత ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబు అపద్ధాల మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. నాయకులు కంచం రామ్మోహన్‌రెడ్డి, ఓబుళరెడ్డి, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు. అలాగే 6వ వార్డులో నిర్వహించిన రీకాలింగ్ కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ నిరంజన్, ప్రమోద్‌రెడ్డి, విజయ్‌కుమార్, అంజి తదితరులు పాలొన్నారు.
- గార్లదిన్నె మండలంలోని బూదేడు, సంజీవపురం, క్రిష్టాపురం గ్రామాల్లో సోమవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రీకాలింగ్ చంద్ర బాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. మండల కన్వీనర్ ఎల్లారెడ్డి, ఎంపీపీ వెంకటనారాయణ, శింగనమల నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు పుల్లారెడ్డి, నియోజకవర్గ ఇంటెలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు అనిల్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
- యాడికి మండలంలోని పుప్పాల గ్రామంలో సోమవారం బాబు ష్యూరిటీ .. మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి సుదర్శన్, నాయకులు ప్రసాద్, ఈశ్వర రెడ్డి, నాగేంద్ర, వెంకటరాముడు, లక్ష్మీరంగారెడ్డి, గంగరాజు, ప్రభాకర్, సుధాకర్, దేవేంద్ర పాల్గొన్నారు.
- నార్పల మండలంలోని నడిమిదొడ్డి, నిలువురాయి, చామలూరులో సోమవారం బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. మండల కన్వీనర్ ఖాదర్‌వలీఖాన్, జెడ్పీ వైస్ చైర్మన్ నాగరత్నమ్మ, ఎంపీపీ నాగేశ్వరావు, ఎంపీటీసీ శంకర్‌యాదవ్, సర్పంచు రామాంజనేయులు, లక్ష్మిరెడ్డి, లింగారెడ్డి, రాము,సూరి, అమీర్, వెంకటరాముడు, లింగారెడ్డి, సోహైల్, ప్రవీణ్ పాల్గొన్నారు.